వామపక్ష రాజకీయాలతోనే దోపిడీ రహిత సమాజం

- పెట్టుబడిదారుల కోసమే బూర్జువా రాజకీయాలు
- పేదలు మరింత పేదలవుతున్న దుస్థితి : బివి రాఘవులు
- వామపక్ష భావజాలం బలపడాలి : చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బూర్జువా రాజకీయాలంటే పెట్టుబడిదారీ రాజకీయాలు. వామపక్ష రాజకీయాలంటే కార్మికులు, శ్రామికులు, కష్టజీవులు, దోపిడీకి గురయ్యే ప్రజల రాజకీయాలు. దేశంలో శ్రమ దోపిడీ, కుల, మత పీడన లేని సమాజం.. కేవలం ఒక్క వామపక్ష రాజకీయాల ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది" అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. జనవరి 25–28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సిపిఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా శుక్రవారం స్థానిక గోకుల్ ఫంక్షన్ హాల్‌లో "వామపక్ష రాజకీయాలు– నేటి అవసరం" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు బీవీ రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమానతలతో కూడిన భారతదేశంలో కనీస వేతనాల కోసం కార్మికులు, గిట్టుబాటు ధరల కోసం రైతులు, చేసేందుకు పని, ఉండేందుకు ఇండ్ల కోసం పేదలు చేసే పోరాటాలకు వామపక్షాలు మాత్రమే అండగా నిలుస్తున్నాయన్నారు. దోపిడీకి గురయ్యే కష్టజీవుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించడానికి ఇష్టపడని బూర్జువా పార్టీలన్నీ కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు, లాభాల కోసమే పని చేస్తున్నాయని తెలిపారు. వామపక్షాలు అధికారంలోకి వచ్చిన దేశాల్లో, రాష్ట్రాల్లో ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకున్న విషయాలను గుర్తు చేశారు. తమిళనాడులో సాంసంగ్ కంపెనీలో కార్మికులు చేసిన సమ్మెకు వామపక్షాలు తప్ప బూర్జువా, పాలక పార్టీలేవీ మద్దతుగా ఉండలేదని తెలిపారు. బిజెపి తెచ్చిన నల్ల చట్టాలకు నిరసనగా రైతులు ఏడాది పాటు సాగించిన పోరాటాన్ని బిజెపి, కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలు పట్టించుకోకపోగా నిర్బంధాన్ని ప్రయోగించేందుకు దోహదపడ్డాయన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పుతున్నామని ప్రధాని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో జరిగే అభివృద్ధి, పెరిగే సంపద ఎవరికి దక్కుతుందనే విషయాన్ని పరిశీలించాలన్నారు. ఒక్క శాతంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లో 56 శాతం ఆస్తులున్నాయని, 98 శాతంగా ఉన్న ప్రజల వద్ద కేవలం ఒక్క శాతమే మిగిలిందన్నారు. అంబానీ, అదానీ ఆస్తులు వందల రెట్లు పెరిగిపోతుండగా, సామాన్యుల్లో మాత్రం కొనుగోలు శక్తి తగ్గిపోయిందని చెప్పారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న బివి రాఘవులు

సరళీకృత ఆర్థిక విధానాల్ని కాంగ్రెస్ అమలు చేస్తే బిజెపి వాటిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నదని విమర్శించారు. దాని ఫలితంగానే దేశంలో విద్య, వైద్యం, రైల్వేలు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక రంగాల్ని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయన్నారు. దాంతో దేశంలో అసమానతలు మరింత పెరిగాయని తెలిపారు. శ్రమను గౌరవించడం, మహిళల్ని సమానంగా గౌరవించడం, హక్కులు, అవకాశాలు కల్పించడం వామపక్ష రాజకీయాల ప్రధాన ఉద్దేశమని స్పష్టంచేశారు. బూర్జువా రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష రాజకీయాలు బలపడేందుకు అసంతృప్తిగా ఉన్న ప్రజల్ని సమీకరించి మరింత సమరశీలంగా ఉద్యమాలు నిర్వహించేందుకు సిపిఎం కృషి చేస్తోందన్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర మహాసభలో ఆ దిశగా కర్తవ్యాలను రూపొందిస్తామని తెలిపారు.

వామపక్ష బావజాలం బలపడాలి: చెరుపల్లి సీతారాములు

దేశంలో, రాష్ట్రంలో వామపక్ష బావజాలం మరింత బలపడాల్సిన అవసరముందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ప్రజల కోసం పనిచేస్తూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వామపక్షాలను బూర్జువా శక్తులు బలహీన పర్చేందుకు కుట్రలు చేస్తున్నాయని తెలిపారు. పార్టీలు మారుస్తూ అధికారం చెలాయించిన వాళ్లెవ్వరూ ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కలిగిన సంగారెడ్డి గడ్డపై జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభల్లో వామపక్ష రాజకీయాలు బలపడేందుకు దోహదపడే చర్చలు, నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ, బాబురావు, ఎం.అడివయ్య, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర నాయకులు జె.మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, ఎ.మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు

- ట్రాఫిక్ రూల్స్‌పై పాఠ్యాంశంగా చేర్చేలా క్యాబినెట్‌లో చర్చిస్తాం
- రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలి : మంత్రి పొన్నం
- జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలకు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ సహకారంతో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్టు రవాణా బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌తో కలిసి 'జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను' మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి పాఠశాల విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' పోస్టర్, పాంప్లెట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మాసోత్సవాలను ఈ నెల 31 వరకు నిర్వహిస్తామని చెప్పారు.

ప్రమాదాల నివారణకు ప్రజలందరికీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. రవాణా, పోలీసు, విద్యాశాఖతోపాటు ఇతర శాఖలన్నీ రోడ్డు భద్రతపై అవగాహన చేసుకొని అమలు చేయడంతోపాటు ప్రజలను చైతన్యవంతులను చేసి సామాజికంగా ముందుకు వెళ్లాలన్నారు. ఏ విషయమైనా చిన్నప్పుడు నేర్చుకున్నది పెద్దయిన తర్వాత ఉపయోగపడుతుందని ఆ ఉద్దేశంతోనే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో యూనిసెఫ్ వారి సహకారంతో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సుమారు 500 నుంచి వెయ్యి పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ నెల 7న జాతీయ రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీచే జాతీయ రవాణా సమావేశం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌ను బ్రేక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఇప్పటివరకు ఏడు వేల మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారి లైసెన్సులను రద్దు చేస్తామని, అయినా అలాగే చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ మరో ముగ్గురికి చెప్పాలని మంత్రి సూచించారు. అనంతరం ఎలక్ట్రికల్ స్టేషన్‌ను ప్రారంభించారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి గంటకూ 20 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని, ఈ విషయమై ప్రతి ఒక్కరినీ చైతన్యపరచాలని అన్నారు. రోడ్ సేఫ్టీ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసులు ఉన్నా లేకున్నా.. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రవాణా శాఖ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే సమయంలో దరఖాస్తుదారునికి ఏ మేరకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉన్నది లేనిది పరిశీలించిన తర్వాతే లైసెన్సులు మంజూరు చేస్తున్నామని, వాహనాల ఫిట్‌నెస్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ సిపి విశ్వప్రసాద్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు సి రమేష్, మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, డిటిసిలు రవీంద్ర కుమార్, కిషన్, సదానందం, ఆర్‌టిఓలు పురుషోత్తం రెడ్డి, సిపి వెంకటేశ్వర్‌రావు, ఎంవిఐలు పాల్గొన్నారు.

భావప్రకటనా స్వేచ్ఛ, పరిశోధనలపై దాడికి ఖండన

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'వీక్షణం' సంపాదకులు ఎన్ వేణుగోపాల్ మీద సోషల్ మీడియాలో చేస్తున్న దాడిని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ, పరిశోధనల మీద జరుగుతున్న దాడి అని విమర్శించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారికి నచ్చని పుస్తకాన్ని అమ్ముతున్నారనే పేరుతో వేణుగోపాల్‌పై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం మీద పరిశోధనలు జరిపిన ఒక చరిత్రకారుడు, అది పూర్వం బౌద్ధక్షేత్రం అనీ, దానికి ఆధారాలున్నాయనీ, 40 ఏండ్ల క్రితం పుస్తకాన్ని విడుదల చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు అది తెలుగులో వెలువడిందని వివరించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆ పుస్తకం అమ్మకానికి పెట్టడాన్ని వారు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఈ చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, పరిశోధనల మీద దాడి అని విమర్శించారు. ఆ పుస్తకాలలో చెప్పిన విషయాలపై అభ్యంతరాలున్న వారు వాటిని ఖండిస్తూ మరో పుస్తకం రాయొచ్చని సూచించారు. ప్రకటనలు చేయొచ్చని పేర్కొన్నారు. కానీ ఒక మతానికి చెందినవారిని రెచ్చగొట్టి దాడులకు ప్రోత్సహించటం ప్రమాదకరమని తెలిపారు. ఇలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, వాటిని ఖండించాలని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులకు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి క్యాంపెయిన్ చేస్తున్నవారి మీద తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే గౌరీ లంకేశ్, ప్రొఫెసర్ ఎంఎం కల్బుర్గి, నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే లాంటి మేధావులను ఇలాంటి శక్తులు హత్య చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టు తులసి చందుపై కూడా ఇదే పద్ధతిలో దాడులకు ఉసి గొల్పుతూ ట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. శాస్త్రీయ విమర్శలకు తట్టుకోలేనివారు, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే శక్తులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడతాయని పేర్కొన్నారు. ఇలాంటి స్వార్థపరుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలనీ, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలని తమ్మినేని విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చండి

- సిఎం రేవంత్‌రెడ్డికి సిఐటియు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, అప్పటివరకు పే–స్కేల్ వర్తింపజేసి న్యాయమైన డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ కోరింది. తమ హక్కుల కోసం డిసెంబర్ 10 నుంచి ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించకపోవడం సరిగాదని పేర్కొంది. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ లేఖ రాశారు. వారికి ఆరోగ్య బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలనీ, రిటైరైన ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ, విద్యా శాఖ నియామకాలలో వెయిటేజి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని విన్నవించారు. విద్యా శాఖలో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సమగ్ర సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. విద్యా శాఖలో సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులతో గత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భద్రత కల్పించి వేతనాలు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. 20 ఏండ్ల నుంచి పనిచేస్తున్నా వారికి గౌరవప్రదమైన వేతనం కూడా ఇవ్వకపోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వారికి సరైన జాబ్‌చార్టు లేదనీ, మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారుల వేధింపులు తీవ్రంగా ఉన్నాయని వాపోయారు. ఆ సిబ్బందిలో సగానికి పైగా మహిళా ఉద్యోగులు ఉన్నారనే విషయాన్ని గుర్తు చేశారు. విద్యా, వైద్య రంగాల్లో ఉన్న అనేక స్కీమ్‌లకు (పథకాలకు) కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు పెంచకుండా వివక్ష చూపుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వైద్యారోగ్య రంగంలోని అనేక స్కీముల్లోని సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా, సమాన పనికి – సమాన వేతనం చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వమే అన్యాయం చేస్తున్న తీరును ఎండగట్టారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు జటిలం కావడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాత్ర కూడా ఉందని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం వ్యవహరించడంతోనే ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సాగదీయడం సరిగాదని సూచించారు. శాంతియుతంగా సమ్మెలో ఉన్న సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎంను కోరారు.

110 కిలోల ఎండు గంజాయి పట్టివేత

హైదరాబాద్ బ్యూరో : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సబ్–డివిజన్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన మెగా వెహికిల్ చెకింగ్‌లో 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అంచనా. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి చెన్నూరి రూపేష్ వివరాలు వెల్లడించారు. ఎస్పీ ఆదేశాలతో జహీరాబాద్ డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శివలింగం, టౌన్ ఎస్ఐ కాశీనాథ్, రూరల్ ఎస్ఐ ప్రసాద్ రావ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సబ్‌డివిజన్ సిబ్బందితో కలిసి జహీరాబాద్ శివారులోని పాత ఆర్‌డిఒ చెక్‌పోస్ట్ సమీపంలో ఎన్‌హెచ్65 బైపాస్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున మెగా వెహికల్ చెకింగ్ చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ముంబై వైపు వెళ్తున్న కారును ఆపడానికి ప్రయత్నించగా.. డ్రైవర్ కారు ఆపకుండా పారిపోయే ప్రయత్నం చేశాడు. కొద్ది దూరం వెళ్లగానే అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పారిపోగా.. ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారిని పట్టుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జహీరాబాద్ శాంతినగర్‌కు చెందిన మహమ్మద్ అక్బర్, మహమ్మద్ సల్మాన్, వారి సోదరుడు ఇస్మాయిల్ అతని అనుచరులు మహబూబ్, రజాక్ కలిసి నవాజ్, షబ్బీర్ అనే ఇద్దరు వ్యక్తుల ఆదేశానుసారం మారుతి షిఫ్ట్ కారులో ఒడిశా సరిహద్దు నుంచి 110 కిలోల గంజాయిని తీసుకువస్తున్నారు. పట్టుబడిన వారిలో అక్బర్, సల్మాన్ ఉండగా మిగతా వారు పారిపోయారు. కాగా వారి వద్ద నుంచి నాలుగు కిలోల బరువున్న 27 గంజాయి ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు.

సంక్రాంతిలోపు త్రిపుల్ ఆర్ భూసేకరణ

- అటవీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతిలోపు నాగ్‌పూర్–విజయవాడ కారిడార్‌తోపాటు త్రిపుల్ ఆర్‌కు భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇతర పనులనూ వేగంగా చేపట్టాలని సూచించారు. సచివాలయంలో రీజినల్ రింగ్ రోడ్డు, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే ప్రాజెక్టులపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. రీజనల్ రింగ్ రోడ్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలనీ, రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ఇందుకు ప్రత్యేకంగా నియమించాలని చెప్పారు. రెండు శాఖలు సమావేశమై సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను వేగంగా చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండేలా డిజైన్ చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలతో సహా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాల్సిందేనని చెప్పారు. ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక ఏ గ్రామానికి రోడ్డు లేదు అనే మాట వినబడొద్దని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశువు గుండెకు సంక్లిష్ట చికిత్స

- రెయిన్‌బో హాస్పిటల్ వైద్యుల ఘనత
- ప్రపంచంలోనే తొలిసారి

ప్రజాశక్తి - హైదరాబాద్

పుట్టుక సమయంలో, చిన్నారులలో ఇతరత్రా సంభవించే గుండె సంబంధిత వ్యాధులను అత్యంత సమగ్రమైన చికిత్సను అందించే అధునాతనమైన హార్ట్ సెంటర్‌గా గుర్తింపు పొందిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఓ క్లిష్టమైన చికిత్స చేశారు. ఇటీవల బెలూన్ డిలేటేషన్, లెఫ్ట్ వెంట్రిక్యులర్ డివైస్ క్లోజర్‌లను కలిపి 27 వారాల పిండంపై విజయవంతంగా గుండె చికిత్సను చేసినట్లు ఆ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. శుక్రవారం హైదరాబాద్‌లో ఆ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోనేటి నాగేశ్వరరావు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్వేతా బఖ్రు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీ ఫణి భార్గవి ధూళిపూడి మాట్లాడుతూ.. చికిత్స వివరాలను వెల్లడించారు. ఇలాంటి చికిత్స ప్రపంచంలోనే తొలిసారి తమ హాస్పిటల్ వైద్యబృందం విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఈ చికిత్స అత్యంత క్లిష్టమైందన్నారు. "పిండం ప్రాణాలు కాపాడుటకు బృహద్ధమని స్టెనోసిస్‌తో వాల్వ్‌లోని ప్లాస్టీని చక్కగా నిర్వహించాము. ఈ విధానంలో పంక్చర్ ప్రదేశాన్ని ఒక పరికరం ఉపయోగించి మూసివేస్తారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు ఎంతో సహకరించాయి. ఈ సంక్లిష్టమైన చికిత్సలో బహుళ రంగ వైద్య బృందం పాల్గొంది. తల్లి గర్భంలోని పిండానికి గుండె చికిత్స అందించటం ఒక అద్భుతమైన అత్యంత సంక్లిష్టమైన వైద్యరంగానికే ఒక సవాలు వంటిది. ఈ చికిత్సకు ఆధునిక ఇమేజింగ్ బృహద్ధమని కవాటం

స్థితిని సవరించిన తర్వాత, పంక్చర్ ప్రదేశంను మూసివేయడానికి డివైజ్ (పరికరం) వాడటం పిండం కార్డియాక్ సంరక్షణలో ఒక వినూత్న బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. ఈ ప్రక్రియకు ఒక చిన్న సూది, మధ్యస్థమైన బెలూన్ ఉపయోగిస్తారు. అయితే శిశువు గుండె నుండి రక్తం లీక్ అయ్యే ప్రమాదాన్ని నివారించుటకు వైద్య బృందం పెద్ద సూది, పెద్ద బెలూన్ ఉపయోగించి అల్ట్రాసౌండ్ ద్వారా తల్లి పొట్ట మరియు గర్భాశయం ద్వారా పిండం గుండెలోకి సూదిని పంపాము. అడ్డంకి తొలగింపు, రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించటానికి బృహద్ధమని కవాటం ద్వారా బెలూన్ కాథెటర్ పనిచేసింది. పంక్చర్ కప్పిపుచ్చుటకు తొలిసారిగా డివైజ్ ఉపయోగించాము. ఈ విధానం పిండం భద్రతకు భరోసా కల్పిస్తుంది. ఈ ప్రక్రియ ప్రపంచవ్యాప్తంగా పిండం కార్డియాక్ సమస్యలున్న కుటుంబాలకు ఆశజనకమవుతుంది." అని వారు తెలిపారు. ఈ వైద్య ప్రక్రియలో మెడిసిన్ స్పెషలిస్టులు, పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు, ఇంటర్వెన్షనల్ ఆబ్జెక్టివ్ బృందం పాల్గొన్నారు.

వారసులకు ఉద్యోగాలపై క్యాబినెట్‌లో తేల్చాల్సిందే

- మూకుమ్మడిగా ప్రజాభవన్‌కు విఆర్‌ఎలు
- అక్కడే బైఠాయించి శాంతియుత నిరసన
- వినతిపత్రం స్వీకరించిన డాక్టర్ జి చిన్నారెడ్డి, దివ్య
- సిసిఎల్ఎ కార్యదర్శి మకరందంకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్‌ఎలు మరోమారు తమ ఐక్యతను చాటారు. జిఒ నెంబర్ 81 ప్రకారం రిటైర్డ్ అయిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు మూకుమ్మడిగా తరలొచ్చారు. 1,500కుపైగా వీఆర్ఏలు శాంతియుత పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించే హాల్ బయట బైఠాయించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య వారి వద్దకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ఇప్పటికే మూడు సార్లు ఇక్కడికొచ్చి వినతిపత్రాలు ఇచ్చాం...కచ్చితంగా న్యాయం చేస్తాం అంటున్నారుగానీ చేయడం లేదు. శనివారం నిర్వహించనున్న క్యాబినెట్‌లో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు అనే అంశాన్ని తేల్చాలి' అని డిమాండ్ చేశారు. వారికి చిన్నారెడ్డి సర్దిచెప్పారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం వెళ్లారనీ, రాగానే మరోమారు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. అనంతరం వినతిపత్రం స్వీకరించారు. ఆ తర్వాత చాలా మంది విఆర్‌ఎలు ప్రజా భవన్ నుంచి సీసీఎల్ఏ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తామని చెప్పారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్న సమయంలో ఇలాంటివి సరిగాదని పోలీసులు వారికి సర్దిచెప్పారు. దీంతో విఆర్‌ఎలు తాము వచ్చి వాహనాలు, ఆర్‌టిసి బస్సుల్లో సిసిఎల్ఎ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీసీఎల్ఏ కార్యదర్శి మకరందంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దయతలిచి శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలిస్తున్నట్టు ప్రకటన చేయాలని కోరారు. అదే సమయంలో విద్యార్హత గల వీఆర్ఏలకు విలేజ్ లెవల్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు మధు, నగేష్ కుమార్, రమేశ్ పటేల్, శివ, సుల్తాన్ గౌడ్, భరత్ రమేశ్ కుమార్, రాజలింగం, రాజశేఖర్, మధు పటేల్, శ్రీకాంత్, వెంకటేష్, సతీష్, హరీష్ గంగమల్లు, సాగర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్.. పరేషాన్..!

- కొత్తగా పట్టాలు పొందిన వారికి దక్కని సాయం
- వారసత్వం.. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారే అర్హులు
- స్పష్టం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలు
- ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఎం కిసాన్ సమ్మాన్ నిధి సహాయం రైతులందరికీ అందడం లేదు. వ్యవసాయంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చింది. 2019లో ప్రారంభమైన ఈ పథకం కింద కొందరు రైతులకు మాత్రమే సాయం అందుతోంది. 2019 జనవరి 31నాటి కంటే ముందు పట్టాలు ఉన్నవారికే ఈ పథకం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆ తర్వాత భూములు కొనుగోలు చేసిన వారికి పెట్టుబడి సాయం అందడం లేదు. కేంద్రం నిబంధనల కారణంగా భూములు ఉండి.. వ్యవసాయం చేస్తున్న వారికి కూడా ఈ సాయం దక్కడం లేదు. కేవలం వారసత్వంతోపాటు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారినే ఈ పథకం కింద పరిగణనలోకి తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థిక సాయం అందజేసింది. ఎకరానికి రూ. ఐదు వేల చొప్పున ఏటా రెండు సార్లు ఈ సాయం కింద రూ.పది వేలు అందజేసింది. ఈ ఆర్థిక సాయం కారణంగా అనేక మంది రైతులు పంట పెట్టుబడి కోసం అప్పులు చేయకుండా ప్రభుత్వం మీద ఆధారపడి పంటలు సాగు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా ఇంకా రైతు సాయంపై నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు అదే పథకాన్ని కొత్త పేరుతో అమలు చేసేందుకు సిద్ధమైంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే కేంద్రం కూడా పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు రూ. రెండు వేల చొప్పున మూడు విడతల్లో రూ.ఆరు వేలు అందిస్తోంది. ఈ పథకం ప్రారంభంలో భూమి కలిగిన అనేక మంది రైతులకు ఈ సాయం వర్తింపజేయడంతో పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా ఉండేది. క్రమక్రమంగా ప్రభుత్వం నిబంధనలు పెడుతూ ప్రభుత్వ ఉద్యోగం కలిగిన వారితో పాటు ఒకే ఇంటిలో ఎక్కువ మందికి వస్తుంటే వాటిని తొలగించింది. దీంతో అనేక మంది రైతులకు ఈ సాయం నిలిచిపోయింది. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి, పట్టాలు మారిన వారికి పథకం వర్తించడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 90,803 కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 34 లక్షల మందికి లబ్ధి చేకూరుతోందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో కంటే తామే ఎక్కువ మందికి సాయంఅందిస్తున్నామనికేంద్రమంత్రులు చెబుతున్నారు.

నిబంధనలతో పరేషాన్

కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేయడానికికొన్ని నిబంధనలు రూపొందించింది. 2019 జనవరి 31 కంటే ముందు పట్టాలు కలిగిన రైతులకు మాత్రమే వర్తింపజేయాలని నిర్ణయించింది. దీంతో ఆ తర్వాత పట్టాలు పొందిన వారు ఈ పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. 2019 నుంచి ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో 13,779మంది కొత్త పట్టాలు కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోగా.. ఇందులో 5518మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి సాయం అందజేస్తోంది. మిగతా 8261 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించింది. అయితే, వారసత్వం కింద పొందే పట్టాదారులతో పాటు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన వారి పరిగణనలోకి తీసుకోవాలని.. ఇతరత్రా క్రయ విక్రయాల ద్వారా భూములు పొందిన పట్టాలు కలిగిన వారికి ఈ సాయం అందించకూడదని నిర్ణయించింది. భూములు ఉన్నప్పటికీ కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందని రైతులు ఎంతో మంది ఉన్నారు. కేంద్రం షరతులతో సాయం అందనివారి సంఖ్య పెరిగే అవకాశముంది.

అర్హులైన వారికి సాయం అందుతోంది..
విశ్వామిత్ర, ఎఓ, వ్యవసాయశాఖ, ఆదిలాబాద్

కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం అర్హులైన అన్నదాతలందరికీ పిఎం కిసాన్ కింద పెట్టుబడి సాయం అందుతోంది. 2019 నుంచి వారసత్వ పట్టాలతోపాటు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన రైతులను మాత్రమే ఈ సాయం కింద పరిగణనలోకి తీసుకొని అందజేస్తోంది.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE AT GUNTUR
O.S.NO. 211/2014

Between:
Mudigonda Srinivasa Rao ... Plaintiff
And
M/s Viswas Real Estate & Infrastructure India Ltd.,, Rep. by its Mg. Director K.Satyanarayana and others ..Defendants
To,
D-04: P.V.K.Chaitanya S/o Prasad Rao, R/o Door No.16/1718, Plot No.404, Mani Sai Project, Balaji Nagar, Serilimpalli Ranga Reddy Dist.
D-13: Chilaka Raja Syam Sundar, S/o.C.V.Daniel, R/o. Flat No.E-98, Syamala Building, Near Vinayaka Temple, Begumpet, Hyderabad.
D-46: Racherla Rama Lakshmi, W/o. Thirupalu, R/o.Flat No.4, House No.9-96/4, Santhi Nagar Colony, Dilsuk Nagar, Hyderabad.
D-54: Onteddu Usha Rani, D/o.Sri Rami Reddy, R/o.Door No.12-2-709/B/2/1, Karolbag, Mehidipatnam, Hyderabad.
D-67: Indukuri Subba Raju, S/o.Appala Raju, R/o Flat No.687, Sai Ram Nagar Colony, Kapra, Secendrabad.
D-70: Chappidi Srinivasa Rao, S/o Gangadharam, R/o. Door No.5-4-34, SLS Homes, Kamala Nagar, Vanastalipuram Hyderabad.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాదులు ది.09-01-2025న ఉ॥ గం॥10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 09-01-2025

యడ్లపల్లి కోటేశ్వరరావు,
వాది తరపు అడ్వకేట్, 2/18, బ్రాడీపేట,
గుంటూరు సెల్: 9397107449

హైదరాబాద్‌లో నీటి కొరతకు చెక్

- 2050 అవసరాలకు సరిపడేలా ప్రణాళిక
- మల్లన్నసాగర్ ద్వారా 20 టిఎంసిల నీటి తరలింపునకు నిర్ణయం : సిఎం
- జలమండలి ఆదాయం పెంపు మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి సూచన
- మంజీరా నీటి పైప్‌లైన్ స్థానంలో అధునాతన లైన్

బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాబోయే 25 ఏళ్ల భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకొని, గ్రేటర్ హైదరాబాద్ సిటీలో తాగునీటి సరఫరాకు మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 నాటికి జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితోపాటు సీవరేజి ప్లాన్ రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్ జలమండలి బోర్డు సమావేశం జరిగింది. బోర్డు చైర్మెన్ హోదాలో తొలిసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ప్రస్తుతం సిటీలో ఉన్న జనాభాకు సరిపడా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9800 కిలోమీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లున్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి సిటీకి నీటి సరఫరా జరుగుతోందన్నారు. కాగా, గోదావరి ఫేజ్-2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా? కొండపోచమ్మ సాగర్‌ను నీటి వనరుగా ఎంచుకోవాలా? అనే దానిపై చర్చించారు. కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతోపాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టిఎంసిల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండి అశోక్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జలమండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందన్నారు. కానీ, వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ.4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని, కరెంటు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్న అప్పులున్నాయని, దాదాపు రూ.8,800 కోట్ల రెవెన్యూ లోటు ఉందని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలమండలి సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని చెప్పారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డిపిఆర్‌లు తయారు చేయించాలన్నారు.

మంజీరా ద్వారా 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, దీంతో రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సిఎంకు వివరించారు. పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్‌ఎండబ్ల్యుఎస్ ఎండి అశోక్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో బ్లాక్ చెయిన్ సిటీ...

- క్వాంటం కంప్యూటింగ్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్' : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్రమలు, నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించామని వెల్లడించారు. శుక్రవారం మాదాపూర్‌లో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ రంగంలో భారీగా ఉపాధి కల్పిస్తున్న 'సెంటిలియన్ నెట్ వర్క్స్ అండ్ హెచ్‌సి రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' నూతన క్యాంపస్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 'కొత్త సాంకేతికల ఆవిష్కరణలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఆయా రంగాల్లో తెలంగాణ యువతకు స్కిల్స్ యూనివర్సిటీ, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫ్యూచర్ సిటీలో నిర్మించ తలపెట్టిన ఎఐ యూనివర్సిటీకి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నాం. ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ప్రారంభించబోతున్నాం' అని తెలిపారు. ఇటీవలి కాలంలో కీలకంగా మారిన డ్రోన్ టెక్నాలజీపై తెలంగాణ యువతకు ప్రత్యేకంగా శిక్షణను ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

ఒపిఎస్‌లను జెపిఎస్‌లుగా మార్చాలి

- సిఎం రేవంత్ రెడ్డికి మానవతారాయ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాత పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ...నాలుగేండ్ల క్రితం నియమితులైన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను (ఒపిఎస్) జూనియర్ పంచాయతీ కార్య దర్శులుగా మార్చాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జెఎసి చైర్మన్ కోటూరి మానవ తారాయ్ సిఎంను కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రెండు వేల మంది ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్పు చేసిందని గుర్తు చేశారు. మరో 900 మందిని మార్చుతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని తెలిపారు. వారిని మార్చే ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తవని పేర్కొన్నారు. డిసెంబర్ 18న ఓయూలో విజయవంతంగా జరిగిన కృతజ్ఞతా సభ జరిగిన తీరుపై సిఎం అభినందించారని తెలిపారు. కార్యక్రమంలో నిరుద్యోగ జెఎసి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు హేమంత్ చౌదరి, ఒయు నిరుద్యోగ జెఎసి నాయకులు పాల్గొన్నారు.

ఐఐటిలు దేశ నిర్మాణ కేంద్రాలు

- అద్భుతమైన ఆవిష్కరణకు వేదిక
- ఐఐటిలకు ఆద్యులు నెహ్రూనే..
- క్రిటికల్ మినరల్స్ వర్క్‌షాప్‌లో : భట్టి

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న భట్టీ విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఐటిలు విద్యా సంస్థలు మాత్రమే కావని, దేశ నిర్మాణానికి దోహదపడే వేదికలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్ (కంది)లో ఆస్ట్రేలియా ఇండియా క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ హబ్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐఐటి హైదరాబాద్ అద్భుతమైన ఆవిష్కరణలకు చిరునామాగా మారిందన్నారు. ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు దేశ భవిష్యత్‌కు కలల కర్మాగారం అని తెలిపారు. ఇక్కడి నుంచి ఇప్పటి వరకు 11,500 పరిశోధనా ప్రచురణలు, 320కి పైగా పేటెంట్లు, స్టార్టప్‌ల ద్వారా రూ.1500 కోట్ల ఆదాయాన్ని అర్జించడం గొప్ప విషయమని అన్నారు. ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ హబ్ కింద మోనాష్ యూనివర్సిటీ సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు కేవలం తెలంగాణకు, భారత దేశానికే కాకుండా ప్రపంచానికే కీలకంగా మారనున్నట్టు తెలిపారు. తెలంగాణలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించడంలో ఈ వర్క్‌షాప్ సహకార స్ఫూర్తికి అద్దం పడుతుందన్నారు. భారత్‌లో ఐఐటీలకు తొలి ప్రధాని నెహ్రూయే ఆద్యులని గుర్తు చేశారు. ఐఐటిలను ఆధునిక భారతదేశ దేవాలయాలుగా నెహ్రూ అభివర్ణించినట్టు గుర్తుచేశారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ.. పేదరికం, అసమానతలపై పోరాడడానికి అవసరమైన సాధనాలుగా నెహ్రూ పేర్కొన్నారని తెలిపారు. ఐఐటి హైదరాబాద్ ఏర్పాటులో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి, దివంగత కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. వైఎస్సార్ నాయకత్వంలోనే ఐఐటీకి పునాదులు పడ్డాయని చెప్పారు. వైఎస్సార్ గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా గొప్ప సంఘసంస్కర్త అని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య సౌకర్యాల మెరుగుదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం వైఎస్ఆర్ ప్రయత్నించినట్టు తెలిపారు. ఐఐటి ఏర్పాటు సమయంలో తాను ఎమ్మెల్సీగా భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో క్లిష్టమైన ఖనిజాలను వెలికితీసేందుకు సమర్థవంతమైన మార్గాలు కనుగొనడం, స్థిరమైన మైనింగ్ పద్ధతులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పరిశోధన, వాటి సంబంధిత సైన్స్ ఆధారిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. క్లిష్టమైన ఖనిజాలు పారిశ్రామిక పదార్థాలు మాత్రమే కాదని, అవి హరిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఉపయోగపడతాయన్నారు. సోలార్ పవర్ ప్యానెల్స్, విండ్ టర్బైన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్ నిల్వ బ్యాటరీల వంటివి క్లిష్టమైన ఖనిజాల ద్వారానే తయారవుతాయని తెలిపారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీని భవిష్యత్ ఇంధనంగా ప్రభుత్వాలు భావిస్తున్నట్టు తెలిపారు. ఆవిష్కరణల ప్రోత్సాహానికి, సుస్థిరతకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. ఐఐటీల ఆలోచనలు పరిశ్రమలను పునర్ నిర్వచించి, ఆర్థిక వ్యవస్థను పునర్మిస్తాయన్నారు. గ్రీన్ ఎనర్జీ, స్థిరమైన టెక్నాలజీ, శాస్త్రీయ ఆవిష్కరణల్లో దేశంలో మొదటి స్థానంలో నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, గౌరవ అతిథి కాన్సుల్ జనరల్ ఎంఎస్ హిల్లరీ మెక్‌గేచీ, ఆస్ట్రేలియన్ కాన్సులేట్-జనరల్ బెంగుళూరు, భారత హైకమిషనర్ గోపాల్ బాగ్లే, మైనింగ్ జాయింట్ సెక్రటరీ దినేష్ మహుర్, సింగరేణి కాలరీస్ సిఎండి మోహన్ యెల్లిశెట్టి, ప్రొఫెసర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 359 అర్జీలు

- పోస్టింగ్ ఇవ్వాలని 2008 డిఎస్‌సి అభ్యర్థుల విన్నపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 359 అర్జీలు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత మేరకు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 103, విద్యుత్ శాఖకు 85, రెవెన్యూ శాఖకు 62, ఇతర శాఖలకు 109 దరఖాస్తులు అందాయి. 2008 డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థులు తమకు పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ ప్రజావాణికి తరలివచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వు తొమ్మిది మేరకు వెంటనే తమకు ఎస్‌జిటి టీచర్‌గా నియామక పత్రాలు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంతో, విద్యాశాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పారిశ్రామికవాడలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని రిషిక కెమికల్స్ గోడౌన్‌లో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో వెంటనే గోడౌన్ సిబ్బందితోపాటు స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గోడౌన్‌లో ప్రమాదానికి షాట్ సర్క్యూట్ కారణమా? లేక మరేదైనా ఉందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద సమయంలో గోడౌన్‌లో ఎవరైనా ఉన్నారా అనేది తెలియరాలేదు. గోడౌన్‌లో భారీ ఎత్తున కెమికల్స్ నిల్వ ఉంచినట్టు సమాచారం. ప్రమాదంతో భారీ స్థాయిలోనే నష్టం జరిగి ఉండొచ్చని తెలుస్తోంది.

సమగ్ర భూ సర్వే చేయాలి

- కాలయాపన కోసమే రైతుభరోసాపై దరఖాస్తుల స్వీకరణ : కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు భరోసాపై మరింత కాలయాపన చేసేందుకే దరఖాస్తుల పల్లవిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుకున్నదని విమర్శించారు. రైతులు, భూముల డాటా ప్రభుత్వం దగ్గర ఉన్న తర్వాత అది ఎందుకు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సీలింగ్ విధానం పెట్టలేదని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజల జీవితాల్లో మార్పు రాలేదనీ, కాంగ్రెస్ నేతల్లో మార్పు వచ్చిందని విమర్శించారు.

ఏడాది దాటినా అన్నదాతలకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. మూడు సీజన్లు గడిచిపోతున్నాయిగానీ రైతు భరోసా మాత్రం రైతులకు అందడం లేదన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఎంఎస్పీ కంటే తక్కువ మిలర్లతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కయ్యిందని ఆరోపించారు. ఆర్థిక మాంద్యంతో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయనీ, వాటిని కేంద్రమే భరిస్తున్నదని చెప్పారు. పదేండ్లలో మోడీ రైతులకు విద్యుత్ కోతలు, ఎరువు కొరత లేకుండా నూతన భారతాన్ని సృష్టించారని తెలిపారు.

కౌలు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- క్యాబినెట్ వారిని గుర్తించాలి
- ఆత్మహత్యల్లో వారే ఎక్కువ
- నాడు రేవంత్‌రెడ్డి రాసిన లేఖకు కట్టుబడాలి
- ఎస్‌కెఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) డిమాండ్ చేసింది. శనివారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో కౌలు రైతులను గుర్తించాలని కోరింది. ఎన్నికల సందర్భంగా టిపిసిసి అధ్యక్ష హోదాలో కౌలు రైతులకు రేవంత్‌రెడ్డి రాసిన బహిరంగ లేఖను అమలు చేయాలని సూచించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నదనీ, దాంతోపాటు కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. రైతులతోపాటు కౌలు రైతుల దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు. భూమిలేని ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఆ మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ కౌలు రైతులకుపెట్టుబడి సాయం రాదనీ, తన పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో అవకాశం లేదని చెప్పారు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.వారికి పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్ట పరిహారాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలుదారీ చట్టం 2011ను అమలు చేయాలని కోరారు. రైతు స్వరాజ్యవేదిక జాతీయ నాయకులు విస్సా కిరణ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుర్తించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తిస్తామని చెప్పినా చేయడం లేదన్నారు. రైతు డిక్లరేషన్‌లోనూ కౌలు రైతులను ప్రస్తావించారని గుర్తు చేశారు. ఏడాది గడిచిన కౌలు రైతుల సమస్యలపై విధి, విధానాలు రూపొందించలేదని విమర్శించారు. గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి, బ్యాంకు రుణాలు, పంటను అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు పి శంకర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకయ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, కొండల్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి, వారిని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

ఎఎన్‌ఎం పోస్టుల సంఖ్యను పెంచాలి

- మంత్రి దామోదర రాజనర్సింహకు ఎఐటియుసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో వెల్లడించిన పోస్టులకు అదనంగా పోస్టులను పెచాలని తెలంగాణ రాష్ట్ర సెకెండ్ ఎఎన్‌ఎం యూనియన్ (ఎఐటియుసి) కోరింది. తద్వారా 18 ఏళ్ల నుంచి పని చేస్తున్న వారికి న్యాయం చేసినట్టవుతుందని సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయుల తదితర నాయకులు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. దాదాపు ఐదు వేల మంది రెండవ ఎఎన్‌ఎంలు 18 ఏళ్ల నుంచి సేవలందిస్తున్నారని చెప్పారు. వయో పరిమితితో పరీక్షకు అర్హత లేని వారికి గతంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ప్రకారం వంద శాతం గ్రాస్ శాలరీ, రూ.పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, రూ.పది లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు.

సిగ్నిఫై కొత్తగా ఫిలిప్స్ విటాఅప్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రముఖ లైటింగ్ ఉత్పత్తుల తయారీ కంపెనీ సిగ్నిఫై భారత్‌లో ఫిలిప్స్ విటాఅప్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఫిలిప్స్ విటాఅప్ విటమిన్ డి ఉత్పత్తిని ప్రేరేపించేందుకు కాంతిని ఉపయోగించడం ద్వారా ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రోత్సహిస్తుందని పేర్కొంది. ఈ వినూత్న లైటింగ్ ఉత్పత్తి చాలా కాలం పాటు ఇండోర్ సెట్టింగ్‌లో యువిబిని తక్కువ తీవ్రత డోస్‌ను అందించడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సుకు మద్దతుగా నిలుస్తుందని పేర్కొంది. ప్రపంచ జనాభాలో దాదాపు 50 శాతం విటామిన్ డి లోపంతో బాధపడుతున్నారని పరిశోధనలు పేర్కొంటున్నాయి. సాంకేతికతను ఉపయోగించి, విటమిన్ డి స్థాయిలను పెంచడంలో తక్కువ తీవ్రత యువిబి ఎక్స్‌పోజర్ ప్రభావాన్ని ప్రదర్శించిందని పేర్కొంది.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలి

- డిప్యూటీ డైరెక్టర్‌కు సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణిలో ఒబిలు, అండర్‌గ్రౌండ్‌లతో సహా అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని, వారికి సరైన రక్షణ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (ఎస్‌సికెఎస్-సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ (జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ)కు కోల్‌మైన్స్ సేఫ్టీ స్టాండింగ్ కమిటీ మెంబర్ మానస ముఖర్జీ నాయకత్వంలో యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కల్పిస్తున్న రక్షణ సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా సింగరేణిలో మైన్స్ ప్రమాదాల్లో మరణిస్తున్న, గాయాలపాలవుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సరైన రక్షణ సౌకర్యాలు కల్పించకుండా, శిక్షణ ఇవ్వకుండా టార్గెట్లు పెట్టి పనిభారం పెంచుతుండటంతో ప్రమాదాలు పెరుగుతున్న తీరును వివరించారు. లోడింగ్‌తో ఉన్న ఎక్స్‌ప్లోజివ్ వాహనాలలో నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులను తరలించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు సేఫ్టీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో బొగ్గు మంత్రిత్వ శాఖామంత్రి ప్రకటించిన రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో కూడా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయని విషయాన్ని ప్రస్తావించారు. మైన్స్ చట్టం సెక్షన్ 52, 53 ప్రకారం చెల్లించాల్సిన ఆర్జిత సెలవులను కూడా కాంట్రాక్ట్ కార్మికులకి అమలు చేయట్లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కన్వేయన్స్ వాహనాలపై నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులతో రోజుకు 12 గంటల పని చేయిస్తూ వారాంతపు సెలవులు కూడా అమలు చేయడంలేదనీ, అదనపు పనికి చెల్లించవలసిన అదనపు వేతనాలు కూడా చట్ట ప్రకారం చెల్లించట్లేదని ప్రస్తావించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో అత్యధిక భాగం ఓసీల నుంచి వస్తున్నదని అటువంటి ఓసీల్లో అత్యధిక భాగం కాంట్రాక్ట్ కార్మికుల పని చేస్తున్నారనీ, వారికి రక్షణ సౌకర్యాలు కల్పించడంలో, సింగరేణి యాజమాన్యం, కాంట్రాక్టర్లు విఫలమవుతున్న తీరును ప్రస్తావించారు. కంపెనీ, ఏరియా లెవల్స్‌లో జరుగుతున్న ట్రై పార్టీ సేఫ్టీ కమిటీ సమావేశంలో యూనియన్ తరపున పాల్గొనే ప్రతినిధులకు కాంట్రాక్టు కార్మికుల యొక్క పని పరిస్థితులపైనా, రక్షణ సౌకర్యాలపైనా సరైన అవగాహన లేకపోవడంతో ఆ సమావేశాల్లో కాంట్రాక్ట్ కార్మికుల రక్షణ గురించి సరైన చర్చ జరగట్లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన సౌత్ సెంట్రల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ కాంట్రాక్ట్ కార్మికుల రక్షణకు అవసరమైన చర్యలు చేపడతామని, సింగరేణి ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైండ్ సేఫ్టీని కలిసిన ప్రతినిధి బందంలో మానస ముఖర్జీతో పాటు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(ఎస్‌సీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంధు క్రాంతి ఉన్నారు.

ఆటోలను ఢీకొట్టిన కారు

- ముగ్గురు మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం
- సంగారెడ్డి జిల్లా నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ హృదయవిధారకర ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల శివారులోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గండి మైసమ్మ నుంచి నర్సాపూర్ వైపు టీజీ35టీక్యూ 168, టీఎస్ 35ఏ2586 అనే నెంబర్ గల రెండు ఆటోలు ప్రయాణికులతో వెళుతున్నాయి. ఈ క్రమంలోనే నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు వెళ్తున్న ఏపీ28డీవీ4801 అనే నెంబర్ గల కారు.. నల్లవల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న మేడాలమ్మ టెంపుల్ వద్ద ఎస్‌హెచ్ 765 రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆ రెండు ఆటోలను ఢీకొట్టింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న కాలేజీ విద్యార్థి ఐశ్వర్య(25), ప్రభుత్వ అధికారి మనిషా(25), సంతోష్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో స్థానికంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో.. గుమ్మడిదల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకొని ఘటనాస్థలిని పరిశీలించారు.

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి జీవిత ఖైదు

- బాధితురాలికి రూ.15 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సొంత కూతురు(బాలికపై)పై లైంగికదాడి చేసిన కేసులో రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడి(తండ్రి)కి జీవిత ఖైదు విధించినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గుండు అంజయ్య హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఉంటూ ప్రభుత్వ కళాశాలలో వాచ్‌మెన్ పనిచేస్తున్నాడు. 2023లో తన కూతురిపై లైంగికదాడి చేశాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారించి శుక్రవారం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.